సాక్షి గుంటూరు

మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



మళ్లీ పెరిగిన పులిచింతల

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,10,854 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. నాలుగు గేట్లు ఎత్తి 1,10,854 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు.



వరద తగ్గుముఖం

కొల్లూరు:వరద తగ్గుముఖం పట్టడంతో కృష్ణా పరివాహక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గత ఆదివారం భారీగా వరదలొచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.



రేషన్ బియ్యం వరదపాలు

కొల్లూరు: వరద ప్రభావిత లంక గ్రామాలలో రేషన్ బియ్యం తడిచిపోయి, బూజు పట్టి భరించలేని దుర్గంధం వెదజల్లుతున్నాయి. అధికారులు వేమూరు గోడౌన్‌కు తరలించారు.

న్యూస్‌రీల్

దుగ్గిరాలలో అత్యధికంగా 16.4 మి.మీ. వర్షం

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 16.4 మి.మీ. వర్షం పడగా, అత్యల్పంగా పెదకాకాని మండలంలో 3.2 మి.మీ. వర్షం పడింది. సగటున 8.4 మి.మీ. నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. ఫిరంగిపురం మండలంలో 12.4 మి.మీ., వట్టిచెరుకూరు 10, మేడికొండూరు 9.8, కొల్లిపర 9.2, పొన్నూరు 9, చేబ్రోలు 8.8, తుళ్లూరు 8.8, గుంటూరు పశ్చిమ 8.8, కాకుమాను 8.6, తాడేపల్లి 7.8, గుంటూరు తూర్పు 7.8, మంగళగిరి 7.4, తాడికొండ 7.2, ప్రత్తిపాడు 6.6, పెదనందిపాడు 5.2, తెనాలి మండలంలో 4.8 మి.మీ. చొప్పున వర్షం పడింది.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

పట్నంబజారు: పవిత్ర అరుణాచల గిరి ప్రదక్షిణను పురస్కరించుకుని, పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో– 2 మేనేజర్ షేక్ అబ్దుల్‌సలామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న బస్సు బయలుదేరి శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శించుకుని, ఆ రోజు రాత్రి అక్కడే ఉండి, 18న గిరి ప్రదక్షిణ, స్వామి దర్శనం అనంతరం సాయంత్రం తిరిగి బయలుదేరి 19న ఉదయానికి గుంటూరు చేరుకుంటుందని వివరించారు. ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకుని అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కో టికెట్ ధర రూ 2,420 మాత్రమేనని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 7382894613కు సంప్రదించాలని మేనేజర్ సూచించారు.

మైనర్‌పై అత్యాచారం కేసులో పాస్టర్‌కు 20 ఏళ్లు జైలుశిక్ష

నగరంపాలెం: మైనర్‌పై అత్యాచారానికి ఒడిగట్టి గర్భవతి చేసిన పాస్టర్‌కు ఇరవై ఏళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు, ఐదో అదనపు జిల్లా జడ్జి నీలిమ సోమవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే..గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటపాలెం గ్రామానికి చెందిన ఎస్.కోటేశ్వరరావు (55)చర్చి నిర్వహించేవారు. గ్రామాల్లోనూ ఆయిల్స్ వ్యాపారం చేసేవాడు. చర్చికి పరిసర ప్రాంతాల వారు వచ్చేవారు. సాయంత్రం చర్చిలో ప్రార్థనలు ముగిశాక మైకులు, పరదాలను కొందరు బాలికలు సర్దేవారు. 2018లో 15 ఏళ్ల బాలికతో కోటేశ్వరరావు అసభ్యంగా ప్రవర్తించి, బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో బాలిక భయపడి, చర్చికి వెళ్లడం లేదు. అయితే, పాస్టర్ ఏం తెలియనట్టుగా బాలిక తండ్రితో మాట్లాడేవాడు. కుమార్తె చర్చికి రావడంలేదని, భయం ఉండటం లేదని తండ్రితో చెప్పేవాడు. తర్వాత బాలికకు నెలసరి సక్రమంగా రాకపోవడంతో తల్లిదండ్రులు విజయవాడలోని పాత ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి నాలుగో నెల గర్భవతిగా నిర్ధారించారు. దీంతో కుమార్తెను ఏం జరిగిందని తల్లిదండ్రులు ఆరా తీయగా, అసలు విషయం బయటకొచ్చింది. ఈ మేరకు తల్లిదండ్రులు పాస్టర్‌పై తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ సీహెచ్.రవిబాబు కేసు దర్యాప్తు చేపట్టి, కోటేశ్వరరావును అరెస్ట్ చేశారు. దీనిపై చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువుకావడంతో సోమవారం కోటేశ్వరరావుకు 20 ఏళ్లు జైలు శిక్ష, లక్ష రూపాయాలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు, ఐదో అదనపు జిల్లా జడ్జి కె.నీలిమ తీర్పు వెలువరించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కారుమంచి శ్యామల ప్రాసిక్యూషన్ తరపున వాదించారు.

రూ.7.10 లక్షలు పలికిన గణేష్ లడ్డూ



రెంటచింతల: స్థానిక ఆనంద్‌పేట కాలనీలో వినాయకుడి వద్ద ఉంచిన 80 కిలోల స్వామి వారి లడ్డూ, 25 గ్రాముల స్వామి వారి బంగారు లాకెట్‌కు సోమవారం రాత్రి జరిగిన వేలంలో రూ.7.10 లక్షలకు భక్తుడు గొంటు ఆదిరెడ్డి దక్కించుకున్నారు. లడ్డూ పాట సందర్భంగా గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. సుమారు రెండు గంటలపాటు గణపతితో ఊరేగింపు కొనసాగిస్తూ రూ.1.65 లక్షల విలువైన బాణసంచా కాలుస్తూ ప్రధాన రహదారిపై యువత కేరింతలు పెట్టారు.

చితికిన రైతు..

చతికిల పడిన సాగు

- జూలైలో వర్షాలు, వరదలతో 11,572 ఎకరాల్లో వరికి దెబ్బ
- 4,393 మంది రైతులకు నష్టం
- నేటికీ అందని ఇన్‌ఫుట్ సబ్సిడీ
- రాయితీ విత్తనాలతో సరి
- నాట్లు కోసం రైతన్న పాట్లు
- మరోసారి వరదలతో నిండా మునిగిన రైతులు
- నేటికీ పంట నష్టాల అంచనాలే లేవు



వంగిపురంలో నీట నానుతున్న పత్తి పంట (ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: జిల్లాలో జూలైలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో వేలాది ఎకరాల్లో వెద పద్ధతిలో సాగు చేసిన వరి పంట దెబ్బతింది. ఆయా భూముల్లో మరలా నాట్లు వేసేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేదు. దెబ్బతిన్న చేలకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పటికీ మంజూరు చేయలేదు. దీనికితోడు పంట పెట్టుబడి సాయం కూడా అందించ లేదు. దీంతో రైతులు సాగు కోసం వడ్డీ వ్యాపారుల్ని ఆశ్రయించాల్సి వస్తోంది. జిల్లాలో సుమారు 1.60 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేయాల్సి ఉంది. జూలైలో కురిసిన వర్షాలతో 11,572 ఎకరాల్లో మాత్రమే వెద పద్ధతిలో సాగు చేశారు. భారీ వర్షాలకు పిలకల దశకు వచ్చిన వరి మొక్కలు దెబ్బతిన్నాయి. రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేస్తామని కూటమి ప్రభుత్వ నేతలు ప్రకటించారు. కంటితుడుపుగా విత్తనాలతోనే సరిపెట్టారు. వర్షాలతో రైతులుఉఉ ఎకరాకు సుమారు 15 వేల వరకు నష్టపోయారు.

అధికారులు నిర్ధారించినా అందని సాయం

జూలైలో వర్షాలకు ముందు జిల్లాలో 90 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. వర్షాల వల్ల వట్టిచెరుకూరు, పెదనందిపాడు, చేబ్రోలు, తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లోని 37 గ్రామాల్లో 11,572 ఎకరాల్లో పూర్తిగా దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. సుమారు 4,393 మంది రైతులకు పరిహారం అందించాలని నిర్ధారించారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక అందించారు. ప్రభుత్వం హెక్టారుకు రూ.17,500 ఇన్‌పుట్ సబ్సిడీని రైతులకు అందించాల్సి ఉంది. సాయం అందితే తిరిగి నాట్లు వేసుకోవచ్చని రైతులు ఆశగా ఎదురు చూశారు. వారి ఆశలు అడియాసలు అయ్యాయి. ప్రభుత్వం నుంచి ఇప్పటికీ సాయం అందలేదు. గత జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాగు ప్రారంభానికి ముందే రైతు భరోసా సాయం అందించేవారని, విపత్తుల సమయాల్లో పంట నష్టపరిహారం త్వరితగతిన మంజూరు చేసేవారని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. జిల్లాలో ఖరీఫ్‌లో సుమారు 1.60 లక్షల ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి సాగు చేయాల్సి ఉంది. ప్రస్తుతం 1.29 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నత్తనడకన ఈ-క్రాప్

జిల్లాలో 1,92,292.33 ఎకరాల్లో వివిధ పంటలు సాగైతే ఇప్పటి వరకు 1,11,375.93 ఎకరాల్లో మాత్రమే ఈ–క్రాప్ నమోదు (61.49 శాతం) జరిగింది. ఈ తరుణంలో పూర్తిస్థాయి పంటల నష్టం జాబితా ఏ విధంగా తయారు చేస్తారోనని అన్నదాతలు వాపోతున్నారు. ఈ–క్రాప్ బుకింగ్‌తో సంబంధం లేకుండా పంటలు నష్టపోయిన వారికి పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

భారీ వర్షాలకు అతలాకుతలం

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుఫాను కారణంగా జిల్లా రైతులు మరోసారి తీవ్రంగా నష్టపోయారు. జిల్లాలో 85,655 ఎకరాల్లో వరి, పత్తి, మినుము, సోయాబీన్, పెసర, జనుము పంటలు నష్టపోయినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 22,400 ఎకరాల్లో పసుపు, జామ, అరటి, బొప్పాయి, తమలపాకు, పూలు, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లినట్లు ఉద్యాన శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి జాబితాను తయారు చేశారు. కానీ ఇంతవరకు పూర్తి స్థాయిలో ఎన్యుమరేషన్ జరగక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

24 గంటల్లో నివేదిక అందించాలి

వరద నష్టంపై కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

గుంటూరు వెస్ట్: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరద కారణంగా నష్టపోయిన ప్రజల ఇళ్లు, వస్తువులు, పంట నష్టం వివరాలతో నివేదికను 24 గంటల్లో తనకు అందజేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి సోమవారం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అందించిన 10 ఫార్మాట్స్ ఎన్యుమరేషన్ సమాచారాన్ని క్రమపద్ధతిలో పొందుపరచాలని సూచించారు. వ్యవసాయం, హార్టీకల్చర్, మత్స్య శాఖ నష్టాలను వేర్వేరుగా అందజేయాలని తెలిపారు. పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు, పూర్తిగా నాశనమైన ఇళ్లు, వీధి వ్యాపారుల రిక్షాలు, తోపుడు బండ్లు, ఆటో రిక్షాలు, మగ్గాల నష్టాలను కూడా వేర్వేరుగా అందజేయాలని చెప్పారు. ఒకే ఇంట్లో ఇద్దరు అన్నదమ్ములు ఉంటే ఒక్కరి పేరే రాయాలని తెలిపారు. మరణించిన, కొట్టుకుపోయిన వారి వివరాలు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, నివాసితుల సంఖ్య, భోజన సదుపాయాల గురించి తెలియజేయాలని చెప్పారు. వరద బాధితులకు ప్రభుత్వం అందించే పరిహారం చెక్కు రూపంలో గానీ లేదా బ్యాంకు ఖాతాలకు జమ చేయడం గానీ చేస్తామని తెలిపారు. బాధితుల ఆధార్, బ్యాంకు వివరాలు సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, డెప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక సరఫరా

ఉచిత ఇసుక సరఫరా పారదర్శకంగా జరిగేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో సోమవారం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇసుక రవాణా సమమయంలో కొంత మంది వాహనదారులు అధిక చార్జీలు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, దీన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించామని స్పష్టం చేశారు. రవాణా కోసం రాష్ట్ర వ్యాప్తంగా కిలోమీటర్‌కు ఒకే ధరను నిర్ణయించారన్నారు. దీన్ని వాహనదారులందరూ పాటించే విధంగా అధికారులు వారితో సమావేశం ఏర్పాటు చేసి వివరించాలని చెప్పారు. ట్రాక్టర్, ఆరు టైర్లు, 10 టైర్ల లారీలకు కిలో మీటర్‌కి రూ.200 ఇస్తేనే గిట్టుబాటు అవుతుందని వాహనదారులు చెప్పారని, వారి డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని కలెక్టర్ తెలిపారు. లోడింగ్, అన్‌లోడింగ్ సమయంలో స్టాక్ యార్డుల వద్ద వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఇసుక విక్రయాలకు ఆన్‌లైన్ పేమెంట్స్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా మైనింగ్ శాఖ డీడీ చంద్రశేఖర్, ఆర్టీఓ గోపాల్, అధికారులు పాల్గొన్నారు.

2047కు అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఏపీ



చెక్కులు అందుకున్న సర్పంచులతో మంత్రి మనోహర్, ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే ఆనందబాబు

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- 25 గ్రామాల సర్పంచులకు చెక్కులు పంపిణీ

తెనాలి అర్బన్: 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి, ఆ దిశగా పని చేస్తోందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. వరదల వల్ల నష్టపోయిన గ్రామ పంచాయతీలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అందించిన ఆర్థిక సాయం చెక్కులను బోసురోడ్డులోని నూకల రామ కోటేశ్వరరావు కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం సర్పంచులకు అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనుకోని విపత్తు సంభవించినప్పుడు బాధితులు దాతల వైపు చూస్తుంటారని తెలిపారు. అలాంటి వారిని అదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి, సంపన్నులపై ఉందన్నారు. గతంలో కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున రూ.5కోట్లు ఇచ్చారని గుర్తు చేశారు. వరదల వల్ల రాష్ట్రంలో దెబ్బతిన్న 400 గ్రామ పంచాయతీలకు రూ.4కోట్లు విరాళంగా ఇచ్చారని తెలిపారు. ప్రస్తుత నిధుల్ని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, మెడికల్ క్యాంప్‌ల ఏర్పాటు, మౌలిక వసతులు కల్పనకు ఉపయోగించుకోవాలని సూచించారు. బాపట్ల ఎంపీ పి.కృష్ణప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పవన్ కల్యాణ్ సొంత నిధులు వెచ్చించడం అభినందనీయమన్నారు. నంతరం తెనాలి, కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు, కాకుమాను, రేపల్లె పరిధిలోని 25 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధికారులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రజల శాస్త్రవేత్త డాక్టర్ నాయుడమ్మ

- నేడు తెనాలిలో నాయుడమ్మ అవార్డు ప్రదానోత్సవం
- ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ సీఎండీ ఎం.ప్రసన్నకుమార్‌కు బహూకరణ



డాక్టర్ యలవర్తి నాయుడమ్మ

తెనాలి: తోలు శుద్ధి ప్రక్రియకు సాంకేతిక పరిజ్ఞానం జోడిస్తే పరిశ్రమకు సమస్యగా ఉన్న మకిలి మాయమైంది. కొన్ని వర్గాలకే పరిమితమైన చర్మ పరిశ్రమ అందరిదైంది. చర్మకారుల నైపుణ్యం పెరిగింది. కులాలకతీతంగా చర్మపరిశ్రమ విస్తరించి, ఆ రంగంలోనూ దేశానికి కీర్తిని తీసుకొచ్చింది. నిశ్శబ్దంగా సాగిన ఈ విప్లవాన్ని సాధించిన ఘనత ప్రజల శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మకు దక్కుతుంది. 'జన్మతః రైతును...వృత్తిరీత్యా అస్పృశ్యుడను' అని చెప్పుకున్న నాయుడమ్మ, తన వృత్తితో చర్మ పరిశ్రమను ఇతర పరిశ్రమలకు దీటుగా తీర్చిదిద్దారు.

యలవర్రు నుంచి ప్రస్థానం

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అమృతలూరు మండల గ్రామం యలవర్రు డాక్టర్ నాయుడమ్మ స్వస్థలం. 1922 సెప్టెంబరు 10న జన్మించారు. దగ్గర్లోని తురుమెళ్లలో హైస్కూలు విద్య, గుంటూరు ఏసీ కాలేజీలో ఇంటర్, తర్వాత బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో కెమికల్ టెక్నాలజీలో బీఎస్సీ చేశారు. 1943లో చెన్నైలో లెదర్ టెక్నాలజీలో చేరారు. అమెరికాలోని లీహై విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ చర్మశుద్ధిపై ఎంఎస్, డాక్టరేట్ పొందారు. 1951లో తిరిగొచ్చి, చెన్నైలోని కేంద్ర చర్మ పరిశోధన సంస్థ (సీఎల్‌ఆర్‌ఐ)లో శాస్త్రవేత్తగా చేరారు. ఆ సంస్థను సాటిలేని పరిశోధన సంస్థగా రూపొందించే కృషితో 1958లో అదే సంస్థ డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

చర్మకారులకు వరప్రసాదాలు

నాయుడమ్మ పరిశోధనలు దేశీయ చర్మ పరిశోధనకు, చర్మకారులకు వరప్రసాదాలయ్యాయి. తన సారథ్యంలో సీఎల్ఆర్ఐ సంస్థ, పారిశ్రామికాభివృద్ధి, గ్రామీణాభివృద్ధిలో గణనీయమైన పాత్ర సాధించింది. పలు దేశాలు తమ చర్మసంపద సద్వినియోగానికి నాయుడమ్మ సలహాలను స్వీకరించాయి. ఐక్యరాజ్య సమితి సలహాదారుగా వివిధ దేశాల్లో తోళ్ల పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడ్డారు. ఫలితంగా కేంద్ర ప్రభుత్వ శాస్త్రసాంకేతిక విషయాలశాఖ కార్యదదర్శిగా, భారత విజ్ఞాన శాస్త్ర పరిశోధన మండలి (సీఎస్ఐఆర్) డైరెక్టర్ జనరల్‌గా ఏకకాలంలో ఆరు సార్లు పనిచేశారు. సీఎస్ఐఆర్ డీజీ ఇరత దేశాల్లో ఉన్నతోద్యోగాల్లో ఉన్న భారతీయ శాస్త్ర సాంకేతిక నిపుణులను స్వదేశానికి రప్పించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు.

సృజనాత్మక పథకాలకు రూపకల్పన

1980లో అభివృద్ధి చెందిన దేశాల్లోని శాస్త్ర సాంకేతిక కమిటీకి అధ్యక్షులుగా నాయుడమ్మ అనేక సృజనాత్మక పథకాలను ప్రవేశపెట్టారు. ఆసియా ఖండానికి చెందిన అసోసియేషన్ ఫర్ సైన్స్ కో–ఆపరేషన్‌కు వ్యవస్థాపక సభ్యునిగా వ్యవహరించారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా, ఐక్యరాజ్యసమితి సీనియర్ సలహాదారుగా, కెనడాలోని అంతర్జాతీయ అభివృద్ధి పరిశోధన కేంద్రం గవర్నర్‌గా, సైన్స్ టెక్నాలజీ హైపర్ కమిటీ చైర్మన్‌గా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గౌరవ సలహాదారుగా పని చేశారు. చర్మ విజ్ఞానంపై 200 పరిశోధన పత్రాలు, 100 వ్యాసాలను సమర్పించారు. నాయుడమ్మ కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వ పద్మశ్రీ గౌరవంతో సహా ప్రతిష్టాత్మక రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డును, పలు యూనివర్సిటీల గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. 1985లో ఆయన ప్రయాణిస్తున్న కనిష్క విమానం బాంబు పేలుడుకు గురై పేలిపోయింది. దేశం ఒక మహోన్నత శాస్త్రవేత్తను కోల్పోయింది.

ఇంధన రంగం నిపుణుడు ప్రసన్నకుమార్



ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.ప్రసన్నకుమార్‌కు విద్యుత్, బొగ్గు పరిశ్రమ సహా ఇంధన రంగంలో మూడు దశాబ్దాలకు పైగా అనుభవముంది. గుజరాత్ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (జీఎస్ఈసీఎల్) ఎండీగా చేస్తూ, ఎన్ఎల్‌సీకి వచ్చారు. జీఎస్ఈసీఎల్ ఎండీగా తన పదవీ కాలంలో నిరంతర ఆవిష్కరణలు, కార్యక్రమాలతో సామర్థ్య జోడింపు, కార్యాచరణ నైపుణ్యం, భద్రతలో అత్యుత్తమ పనితీరును కనబరచారు. ప్రస్తుత ఎన్ఎల్‌సీ సీఎండీగా ఆ సంస్థ, పాన్ ఇండియా స్థాయిలో కమర్షియల్ మైనింగ్‌లో తొలిసారిగా ఆర్ఈలోకి ప్రవేశించింది. బొగ్గు మంత్రిత్వశాఖ నిర్వహించిన పోటీ బిడ్డింగ్‌లో 33 ఎంటీపీఏ సామర్థ్యం కలిగిన వాణిజ్య బొగ్గు బ్లాకులను గెలుచుకుంది. రెండు జీడబ్ల్యూ ఆర్ఈ ప్రాజెక్టుల ఏర్పాటు, థర్మల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు రెండు రాష్ట్ర ప్రభుత్వాలతో ఒప్పందాలు చేసుకుంది. పీపుల్ పోక్స్ట్ సీఈవో ఆఫ్ ది ఇయర్–2024 సహా పలు ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్న ప్రసన్నకుమార్ తెలుగువారు. బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీలో మెకానికల్ ఇంజినీరింగ్‌లో గోల్డ్ మెడలిస్ట్. నాలుగు స్పెషలైజేషన్స్‌తో ఎంబీఏ చేశారు.

నడి రోడ్డుపై గంజాయి బ్యాచ్ వీరంగం

- ఒకరిపై ఒకరు సీసా పెంకులతో దాడి
- గంజాయి మత్తులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలు
- భయభ్రాంతులైన ప్రజలు
- పోలీసులతో అరగంటకు పైగా ముష్టి యుద్ధం
- ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్న పోలీసులు
- చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలింపు



గంజాయి మత్తులో ఉన్న యువకుల్ని ఆటోలో పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

తాడేపల్లి రూరల్ : మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ రోడ్డులో ప్రకాష్‌నగర్ వద్ద సోమవారం ముగ్గురు యువకులు గంజాయి మత్తులో ఒకరిపై ఒకరు మద్యం సీసాలు పగలగొట్టి దాడి చేసుకున్న సంఘటన ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసింది. సేకరించిన వివరాల ప్రకారం.. తిరుపతికి చెందిన హరీష్, బందరుకు చెందిన నాగరాజు, వైజాగ్‌కు చెందిన పరశురాం క్యాటరింగ్ పనులు చేస్తుంటారు. రెండు రోజుల నుంచి నులకపేట పరిధిలోని పలు వినాయక పందిళ్ల వద్ద భోజనాలు వడ్డించేందుకు వచ్చారు. సోమవారం డోలాస్‌నగర్‌లోని బెల్ట్‌షాపులో ఫుల్‌గా మద్యం తాగారు. అక్కడ ముగ్గురి మధ్యా మాటా మాట పెరిగింది. ఇద్దరు యువకులు కలసి మరో యువకుడిపై పగలగొట్టిన మద్యం సీసాలతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గంజాయి మత్తులో ఉన్న అతడు కూడా ఆ ఇద్దరిపై దాడిచేయడంతో వారు స్వల్పంగా గాయపడ్డారు. ఆ ప్రాంతమంతా రోడ్డుపై రక్తపు మరకలు అవడంతో స్థానికులు భయభ్రాంతులై తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసుల మీద ఈ ముగ్గురూ దాడికి పాల్పడ్డారు. తమదైన శైలిలో ట్రీట్‌మెంట్ ఇచ్చారు. స్థానికుల సహాయంతో వారి చేతులు, కాళ్లు కట్టేసి బలంతంగా ఆటోలో ఎక్కించి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తీవ్రంగా గాయాలు కావడంతో తాడేపల్లి పోలీసులు వైద్య నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గత రెండు వారాల్లో ఇది మూడో సంఘటన. పోలకంపాడులో గంజాయి మత్తులో ఐదుగురు యువకులు ఒక ఇంటిపై దాడిచేసి తల్లీకొడుకుల్ని గాయపరిచారు. ఈ కేసులో పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఐదు రోజుల కిందట తాడేపల్లి రైల్వే యార్డ్ సమీపంలో పోలీస్‌స్టేషన్‌కు అతి సమీపంలో ఉండే ఓ యువకుడిపై మహానాడుకు చెందిన ఓ నాయకుడి కుమారుడు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన యువకుడు గతంలో పలు గొడవల్లో ఉండడంతో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడం విశేషం.

మద్యం సీసాలు ధ్వంసం

పట్నంబజారు: జిల్లావ్యాప్తంగా పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను సోమవారం గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు ధ్వంసం చేశారు. గుంటూరు నగరంలో ఉన్న నల్లచెరువులోని డంపింగ్ యార్డులో బుల్‌డోజర్‌తో పగుల గొట్టించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జిల్లాలో అక్రమ మద్యం రవాణా కేసుల్లో పలువురు వ్యక్తుల్ని అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు తెలిపారు. వారి నుంచి మద్యం స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా 945 కేసుల్లో 24,031 సీసాల్లోని 4647.485 లీటర్ల మేర రూ 50లక్షలు విలువ చేసే మద్యాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సెబ్ అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వరరావు,ఈస్ట్ సబ్‌డివిజన్ ఇన్‌చార్జి డీఎస్పీ బి.వి. సుబ్బారావు, సీఐలు ఏ.వి. శివప్రసాద్, మధుసూదనరావు, ఎం. వీరయ్య, రమేష్‌బాబు, వంశీధర్ పాల్గొన్నారు.

బాటిళ్లను ఎత్తుకుని పరార్

మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న క్రమంలో చూడ్డానికి వచ్చిన కొంత మంది వాటిని చేత పట్టుకుని పలాయనం చిత్తగించారు. స్వయంగా ఎస్పీ సతీష్‌కుమార్ ఉన్న సమయంలో ఈ ఘటనలు చోటు చేసుకోవడం గమనార్హం. అయితే, పోలీసులు వెంటనే స్పందించి కొందరి నుంచి బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.



సీసాలను ధ్వంసం చేయిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, అధికారులు

క్లుప్తంగా

యార్డుకు 33,890 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 33,890 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 30,442 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.8,500 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 8,000 నుంచి రూ. 16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 98,000 నుంచి రూ. 18,400 వరకు ధర పలికింది. తాలు రకానికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 20,287 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

12న భవిష్యనిధి పెన్షన్ అదాలత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు కృష్ణనగర్‌లోని భవిష్యనిధి (పీఎఫ్) ప్రాంతీయ కార్యాలయంలో ఈనెల 12న పెన్షన్ అదాలత్, ప్రయాస్ వెబినార్ నిర్వహిస్తున్నట్లు సహాయ పీఎఫ్ కమిషనర్ జీఆర్‌జేఆర్ మాధవ శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పీఎఫ్ పెన్షనర్లు వారి ఫిర్యాదులు, దర్ఖాస్తులను నేరుగా భవిష్యనిధి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న పెన్షన్ అదాలత్‌లో సమర్పించవచ్చని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా హాజరు కాలేని వారు ఆన్‌లైన్, వాట్సాప్, వెబ్ మార్గాల ద్వారా పంపవచ్చని సూచించారు. so.f unt ur@e pfi ndia.gov.i n తో పాటు వాట్సాప్ నంబరు 94946 57469కు పంపాలని తెలిపారు. ల్యాండ్‌లైన్ నంబర్లు 0863-2344106, 2232921లో సంప్రదించాలని పేర్కొన్నారు. అదే విధంగా వెబ్ ఎక్స్ ఐడీ 2644 955 1275 ద్వారా లాగిన్ కావాలని తెలిపారు. పీఎఫ్ పెన్షన్ దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఏఆర్ కానిస్టేబుల్ ఇంటిలో చోరీ

పట్నంబజారు: గుంటూరు నగరంలోని ఏటీఅగ్రహారంలో నివాసం ఉంటున్న ఏఆర్ కానిస్టేబుల్ నివాసంలో చోరీపై సోమవారం కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటీఅగ్రహారంలో నివాసం ఉండే కొండపాటూరి రామకృష్ణ ఏఆర్ ఎంటీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఇంటి వెనుక భాగం నుంచి తలుపులు పగులగొట్టి, లోపలకు వచ్చారు. సుమారు పది సవర్ల బంగారు ఆభరణాలు, పలు వెండి సామాన్లు అపహరించుకు పోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వరదలు తగ్గినా 'దారి'ద్ర్యం తీరలేదు

- తాడికొండ- కంతేరు రోడ్డుపై నిలిచిన రాకపోకలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



కంతేరు ఎర్రవాగు వద్ద ధ్వంసమైన రోడ్డు

తాడికొండ: వరదలు తగ్గి వారం రోజులైనా తాడికొండ మండలంలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొండవీటి వాగుకు వచ్చిన వరద తాకిడికి తాడికొండ- కంతేరు గ్రామాల మధ్య ఎర్రవాగు వద్ద రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. గుంతలమయంగా మారింది. ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని దుస్థితికి చేరింది. వరదలు పూర్తిగా తగ్గిపోయినప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు కనీస మరమ్మతులు చేయకపోవడంతో ప్రయాణికులకు అష్టకష్టాలు తప్పడం లేదు. తాడికొండ నుంచి నాగార్జున యూనివర్సిటీ, మంగళగిరి, కంతేరు, విజయవాడ ప్రాంతాలకు వెళ్లాలంటే ఇదే ఏకైక రహదారి. దీంతో గత 10 రోజులుగా గ్రామస్తులు నానా పాట్లు పడుతున్నారు. ఇటు తుళ్లూరు కరకట్ట మీదుగా లేదా గుంటూరు వెళ్లి తిరిగి మంగళగిరి రావాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన చెందుతున్నారు.

పత్తా లేని ఎమ్మెల్యే

వరద వచ్చినప్పటి నుంచి స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఈ పరిసరాల్లోకి తొంగి చూసిన దాఖలాలే లేవు. స్థానిక నాయకులు మాత్రం ఓ రోజు రోడ్డు వద్దకు ఆర్ అండ్ బీ అధికారులను తీసుకొచ్చి నానా హడావుడి చేశారు. కనీసం మిక్స్‌డ్ డస్ట్ కూడా వేసిన నాథుడు కరువవ్వడంతో ప్రస్తుతం గుంతలు పడిన రోడ్డుపై సర్కస్ ఫీట్లు వేస్తూ ప్రయాణికులు నానా పాట్లు పడుతున్నారు. చీకటి పడితే ఆ ప్రయాణం కూడా ప్రాణగండమే. పొరబాటున వాహనం అదుపుతప్పిందా గాయాలపాలు కావాల్సిన దుస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు సత్వరమే స్పందించి రోడ్డుకు కనీస మరమ్మతులు చేసి అవస్థలు తప్పించాలని పలువురు కోరుతున్నారు.



కంతేరు- తాడికొండ మధ్య గుంతలు



కోతకు గురైన రోడ్డుపై ప్రమాదకర ప్రయాణం

వరద ప్రాంతాల్లో నష్టం నమోదు ప్రారంభం

- ఒకటి రెండు రోజుల్లో పూర్తి
- తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ



తెనాలి: డివిజన్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆస్తి, పంట నష్టం నమోదు చేపట్టినట్లు సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ వెల్లడించారు. ఒకటి, రెండు రోజుల్లో పూర్తి కాగలదని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలతో ఈనెల ఒకటిన బాధ్యతలు స్వీకరించిన సబ్‌కలెక్టర్, తక్షణమే వరద ప్రాంతాల్లో సహాయక చర్యల్లో నిమగ్నమైన విషయం తెలిసిందే. సోమవారం స్థానిక్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డివిజన్‌లోని ఎనిమిది మండలాల్లో తాడేపల్లి, మంగళగిరి, కొల్లిపర మండలాలకు వరద తాకిడి తగిలిందని చెప్పారు. మాగాణిలోని వరి, మెట్టలో సాగయే అరటి, పసుపు, కంద వంటి ఉద్యాన పంటలకు నష్టం కలిగిందని చెప్పారు. చాలా ప్రాంతాల్లో ఇంకా వరదనీరు బయటకు వెళ్లలేదన్నారు. ఈ-క్రాప్ నమోదు, పంట నష్టం గణన తర్వాత ప్రభుత్వం ప్రకటించిన సాయం, పరిహారం అందుతుందని చెప్పారు. కొన్నిచోట్ల పశు నష్టంతో పాటు పాకలు కొట్టుకుపోయాయని వివరించారు. వీటితోపాటు ఆటోలు, తోపుడుబండ్లు దెబ్బతిన్నాయని చెప్పారు. మంగళగిరిలో చేనేతలు వరదకు నష్టపోయారని, ఇళ్లలోకి, నేత మగ్గాల్లోకి నీరు చేరిందని ఆమె తెలిపారు. బాధితులను సహాయక శిబిరాలకు చేర్చామని, నిత్యావసరాలను పంపిణీ చేశామని సబ్ కలెక్టర్ చెప్పారు. వరదకు దెబ్బతిన్న ఇళ్ల అంచనాలు తీస్తున్నామని, జీవో నంబర్ 5 ప్రకారం పరిహారం ఇస్తామని వివరించారు. కృష్ణానదికి ఆదివారం వరద పెరగడంతో సహాయక శిబిరాలకు రమ్మని ప్రభావిత ప్రాంతాల ప్రజలకు సూచించినట్టు చెప్పారు. అవసరమైన శిబిరాలు కొనసాగుతాయని చెప్పారు.

96వ అధిపతి

116 ఏళ్ల చరిత్ర కలిగిన తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి సంజనా సింహ 96వ అధిపతి. అయిదో మహిళా ఐఏఎస్ అధికారిణి. తొలుత చిత్రా రామచంద్రన్ (1988-89), శైలజా రామయ్యర్ (1999-2001), నిధి మీనా (2021-22), గీతాంజలి శర్మ (2022-23) పనిచేశారు. గతంలో ఒకే ఒక మహిళ వి.ఉషారాణి (1992-93) డెప్యూటీ కలెక్టర్‌గా చేశారు. ప్రస్తుత సబ్‌కలెక్టర్ సంజనా సింహ హైదరాబాద్‌కు చెందినవారు. 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారిణి. నెల్లూరు జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణ పూర్తిచేసుకున్నాక, విద్యుత్ మంత్రిత్వశాఖలో కార్యదర్శిగా చేశారు. సబ్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్‌ను తెనాలిలో చేపట్టారు.

'విజ్ఞాన్'ను సందర్శించిన జింబాబ్వే ప్రతినిధులు



జింబాబ్వే ప్రతినిధులతో చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీని జింబాబ్వే ప్రభుత్వ ప్రతినిధులతో పాటు న్యూఢిల్లీ నుంచి ఎంబసీ ప్రతినిధులు సందర్శించినట్లు వైస్ చాన్సలర్ పి. నాగభూషణ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఇండియాలోని జింబాబ్వే ప్రతినిధి మాట్లాడుతూ గత ఏడాది 45 మంది విద్యార్థుల్ని జింబాబ్వే ప్రభుత్వం విజ్ఞాన్ యూనివర్సిటీలో వేర్వేరు ఇంజనీరింగ్ కోర్సుల్లో చదవడానికి పంపించినట్లు తెలిపారు. అగ్రికల్చర్ బీఎస్సీకి ప్రాముఖ్యతనిస్తూ జింబాబ్వే ప్రభుత్వం ఈ సంవత్సరం కూడా 107 మందిని ఇక్కడకు పంపినట్లు చెప్పారు. విజ్ఞాన్‌లో చదువుతోపాటు మంచి నైపుణ్యాలు, కమ్యూనికేషన్స్ స్కిల్స్ నేర్పుతున్నట్లు పేర్కొన్నారు. చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ జింబాబ్వేలో ఎక్కువగా వరి పండించడానికి కావాల్సిన నైపుణ్యాలను యూనివర్సిటీలో జింబాబ్వే విద్యార్థులకు నేర్పిస్తున్నట్లు చెప్పారు. వైస్ చైర్మన్ శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపరచడానికి విద్యార్థులు కీలకంగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. జింబాబ్వే కూడా త్వరితగతిన అభివృద్ధి చెందేలాగా ఇక్కడ చదివిన విద్యార్థులు కృషి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, సీఈవో నందిగామ శ్రీకాంత్, ఆయా విభాగాల డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న మనోహర్, బ్రహ్మం, శివాజీ

గుంటూరు ఎడ్యుకేషన్: టీజేపీఎస్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న జి. యేసమ్మ ఈనెల 14న జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో భాగంగా 200 మీటర్ల పరుగులో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థిని యేసమ్మ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని తెలిపారు. మరో విద్యార్థిని ఎస్‌కే పర్వీన్ 5కే మారథాన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థుల్ని చదువుతో పాటు వారికి ఆసక్తి గల రంగాల్లో ప్రోత్సహించడం ద్వారా జీవితంలో త్వరగా స్థిరపడతారని పేర్కొన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఫీజులో రాయితీలను కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వ్యాయామ అధ్యాపకుడు ఆర్. శివాజీ, ఎన్ఎస్ఎస్ అధికారిణి జయ శైలజ పాల్గొన్నారు.

మైనర్ బాలికతో వృద్ధుడి అసభ్య ప్రవర్తన

- గతంలో పోక్సో కేసులో ఐదు సంవత్సరాల శిక్ష
- తిరిగి అదే ప్రవర్తన

తాడికొండ: మైనర్ బాలికతో వృద్ధుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన తాడికొండ మండలం పొన్నెకల్లులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొన్నెకల్లు గ్రామానికి చెందిన కన్నెబోయిన తిరుపతయ్య(77) ఇంటికి సమీపంలోని 10 సంవత్సరాల బాలికను లోపలకు పిలిచి అసభ్యంగా ప్రవర్తించాడు. గమనించిన తల్లిదండ్రులు తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ కె. వాసు తెలిపారు. నిందితుడు తిరుపతయ్య గతంలో కూడా మైనర్‌పై అసభ్య ప్రవర్తన కేసులో ఐదు సంవత్సరాల శిక్షపడి ఇటీవలే జైలు నుంచి వచ్చాడు. తిరిగి బాలికపై అసభ్యంగా ప్రవర్తించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టీటీడీ ఆలయంలో చోరీ

రెండు హుండీలు పగలగొట్టి నగదు అపహరణ

తాడికొండ: తుళ్లూరు మండలం అనంతవరం టీటీడీ ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుండగులు రెండు హుండీలు పగలగొట్టి నగదును దోచుకెళ్లారు. వాటిల్లో సుమారు రూ.50 వేలు ఉండొచ్చని టీటీడీ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అమరావతి రాజధానిగా ప్రకటించిన తరువాత ఆలయాన్ని టీటీడీ తీసుకోవడంతో భద్రత పెంచారు. సీసీ కెమెరాలతో పాటు ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు. అయితే, చోరీ జరిగిన సమయంలో సెక్యూరిటీ సిబ్బంది వాష్ రూమ్ నిమిత్తం బయటకు వెళ్లానని చెబుతున్నట్లు సమాచారం. ఘాట్ రోడ్డుకు కింద గుడి వద్ద కూడా ఒకరు కాపలాగా ఉంటున్నారు. ఇంత భద్రత నడుమ చోరీ ఎలా జరిగిందనే దానిపై పోలీసులకు ఇంకా స్పష్టత రాలేదు. క్లూస్ టీమ్ ఘటనా స్థలాన్ని సందర్శించి ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇది రోడ్డే.. నమ్మండి !



గుంటూరు తూర్పు నియోజకవర్గపరిధిలోని శివనాగరాజు కాలనీ నుంచి ఇన్నర్ రింగ్‌కు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. వాహనాలతో తాకిడితో నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తారురోడ్డును నిర్మించింది. అయితే, నగరంలో నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డుకు వెళ్లే రహదారుల్లో ఇదీ ఒకటి కావడంతో భారీ టిప్పర్లు, ట్రాక్టర్లు వెళ్లడంతో కుంగిపోయి, గుంతలు పడ్డాయి. దీంతో పాటు ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా దెబ్బతిన్న రహదారి మధ్యలో ఏర్పడిన గుంతలు భారీ నీటి కుంటలను తలపిస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం రహదారుల నిర్వహణను గాలికి వదిలేయడంతో ఈ రహదారి మరీ దారుణంగా తయారైంది. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. -గుంటూరు ఎడ్యుకేషన్

జిల్లాలో పలువురు ఎస్‌ఐలు బదిలీ

వీఆర్‌లో ఉన్న వారికి పోస్టింగ్‌లు

నగరంపాలెం: జిల్లాలో పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐలు కె.ఆదినారాయణను నగరంపాలెం పీఎస్‌కు, షేక్ ఇబ్రహీం తెనాలి త్రీటౌన్ పీఎస్, షేక్ బాబావలి గుంటూరు పీసీఆర్, ఎం.కోటేశ్వరరావు తూర్పు ట్రాఫిక్ పీఎస్, జె.శ్రీనివాస్ తాడేపల్లి పీఎస్‌కు, కె.ఏడుకొండలు తుళ్లూరు పీఎస్‌కు, ఆర్.రవీంద్రరెడ్డి తాడేపల్లి ట్రాఫిక్ పీఎస్‌కు, డీఎస్‌బీలో ఉన్న టి.నరేంద్రకుమార్‌ను తాడేపల్లి పీఎస్‌కు, తాడేపల్లి ట్రాఫిక్ పీఎస్ ఎస్‌ఐ ఎం.సుబ్బారావు తాడేపల్లి పీఎస్‌కు, పాత గుంటూరు పీఎస్‌కు పి.భాగ్యరాజ్, నల్లపాడు పీఎస్ ఎస్‌ఐ బి.బాబురావును తుళ్లూరు పీఎస్‌కు, డీసీఆర్‌బీలో ఉన్న డి.శ్రీహరిని పశ్చిమ ట్రాఫిక్ పీఎస్‌కు, గుంటూరు పీసీఆర్‌లో ఉన్న జి.శివకృష్ణారెడ్డిని తుళ్లూరు ట్రాఫిక్‌కు, తెనాలి ఎస్‌హెచ్‌ఓ- 2 పీఎస్ ఎస్‌ఐ పి.కోటేశ్వరరావును కొల్లిపర పీఎస్‌కు బదిలీ చేశారు.

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం



సోమయ్య (ఫైల్)

చినగంజాం: మనస్తాపంతో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈఘటన మండల పరిధిలోని పల్లెపాలెంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని పల్లెపాలెం పంచాయతీ పెద్దపల్లెపాలెం గ్రామానికి చెందిన దండుప్రోలు సోమయ్య (32) సముద్ర తీరంలోని ఒడ్డును ఉన్న సరుగుడు తోటలో ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. 20 రోజుల కిందట తల్లిదండ్రులతో చిన్నపాటి గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతనికి ఏడాదిన్నర క్రితం వివాహం కాగా భార్య జ్యోతి గర్భిణి కావడంతో ఇటీవల కరేడు గ్రామం పుట్టింటికి వెళ్లింది. ఆమె కూడా 10 రోజుల కిందట మగబిడ్డను ప్రసవించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా సోమవారం స్థానికంగా సముద్ర ఒడ్డున చెట్టుకు ఉరేసుకొని వేలాడుతూ కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని సముద్ర తీరంలో గొర్రెల కాపరులు గుర్తించి గ్రామంలో సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనాస్థలానికి వెళ్లిన అతని తల్లిదండ్రులు వారి కుమారుడు సోమయ్యగా గుర్తించారు. మృతుడి సోదరుడు గణేష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేశారు. కేసు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ పి.ప్రకాష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

వేటపాలెం: జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఆదివారం అర్ధరాత్రి చల్లారెడ్డిపాలెం ఎఫ్‌సీఐ గోదాముల వద్ద రోడ్డుపై నడిచి వెళ్తున్న గుర్తు తెలియని మహిళను లారీ ఢీకొట్టింది. తల పగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు యాచకురాలై ఉంటుందని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఎం.వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

జవహర్ నవోదయలో ప్రవేశాలకు ఆహ్వానం

నకరికల్లు: జవహర్ నవోదయ విద్యాలయాల్లో చేరగోరే విద్యార్థులు ఈనెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ ఎస్.ప్రసాద్ సూచించారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో ఐదో తరగతి చదువుతూ ఉండాలన్నారు. మూడు, నాలుగో తరగతులు ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 1 మే 2013 నుండి 31జులై 2015 మధ్య పుట్టిన వారై ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. మూడో వంతు సీట్లు బాలికల కోసం కేటాయింపు ఉందన్నారు. 18 జనవరి 2025న, 12 ఏప్రిల్ 2025న ప్రవేశపరీక్షలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. వివరాల కోసం మద్దిరాలలోని జవహర్ నవోదయ విద్యాలయం, 9901009587, 9866660593, 9494676751 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించండి

జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ షేక్ మజీదాబి



వైద్యాధికారులతో మాట్లాడుతున్న డాక్టర్ షేక్ మజీదాబి

ప్రత్తిపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ షేక్ మజీదాబి అన్నారు. ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం డీసీహెచ్ఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అంటువ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీజనల్ రోగాల బారిన పడి ఆస్పత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని వైద్యాధికారులకు సూచించారు. సీహెచ్‌సీలో 24 గంటలూ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. విధుల్లో సమయపాలన పాటించకుండా అలసత్వం వహిస్తున్న సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆస్పత్రి డీడీవో డాక్టర్ అఖిల్‌కు డీసీహెచ్ఎస్ ఆదేశాలు జారీ చేశారు.

భావితరాలకు తెలుగు పద్యం అందించాలి

ఘనంగా కొప్పరపు కవుల కళాపీఠం 22వ వార్షికోత్సవం



సాహితీ పురస్కారం అందుకున్న శ్రీచరణ్, అపర్ణ, అవధానులతో మా శర్మ

నరసరావుపేట ఈస్ట్: తెలుగు పద్యం, అవధాన ప్రక్రియను భావితరాలకు అందించాల్సిన బాధ్యత సాహితీవేత్తలపై ఉందని కొప్పరపు కవుల సాహితీ పురస్కార గ్రహీతలు పేర్కొన్నారు. శ్రీ కొప్పరపు కవుల కళాపీఠం 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి కళాపీఠం, శ్రీనరసరావుపేట కళావేదిక ఆధ్వర్యంలో శ్రీశృంగేరి శంకరమఠంలోని శ్రీ భారతీ తీర్థస్వామి కళావేదికలో అవధాన కళా కేళి సాహితీసభ, కొప్పరపు సీతారామప్రసాదరాయకవి శత వసంతోత్సవం, అవధాని ప్రక్రియ నిర్వహించారు. కొప్పరపు కవుల వంశీకుడు మా శర్మ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో ద్విభాషా ద్విశతావధాని పాలడుగు శ్రీచరణ్, ద్విశతావధాని బులుసు అపర్ణలకు కొప్పరపు సాహితీ పురస్కారంతో సత్కరించారు. గురు సహస్రావధాని కడిమెళ్ల వరప్రసాదు, శతావధాని పాలపర్తి శ్యామలానందప్రసాద్‌లను సత్కరించారు. పురస్కార గ్రహీతలు మాట్లాడుతూ కొప్పరపు కవుల ధారణను ఇప్పటి వరకు అందుకున్న సాహితీవేత్తలు లేరనీ, ఇకముందు రారని తెలిపారు. కొప్పరపు కవులు ఆసువుగా దాదాపు 8లక్షల పద్యాలను చెప్పారనీ, ఇవి లెక్కకు వచ్చినవి మాత్రమేనన్నారు. కొప్పరపు కవుల పలుకు పద్యంగా రాణించిందని కొనియాడారు. నటుడు, కవి డాక్టర్ అక్కిరాజు సుందరరామకృష్ణ కొప్పరపు కవుల పద్యాలను గానం చేసి అలరించారు. పాలడుగు శ్రీచరణ్ నిర్వహించిన అవధానం ఆకట్టుకుంది. అవధాన సంచాలకులుగా శతావధాని పాలపర్తి శ్యామలానందప్రసాద్ వ్యవహరించగా పృచ్ఛకులుగా డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి (నిషిద్ధాక్షరి), డాక్టర్ మేళ్లచెర్వు భానుప్రసాదరావు (సమస్య), పోలూరి వెంకటశివరామప్రసాదరావు (దత్తపది), డాక్టర్ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి (వర్ణన), డాక్టర్ వేదాన్తం సత్యశ్రీనివాస అయ్యంగార్ (న్యస్తాక్షరి), డాక్టర్ కె.వి.కోటయ్య (ఆశువు), డాక్టర్ నారాయణం వెంకటరాంబాబు (పురాణం), రత్నాకరం రాము (అప్రస్తుత ప్రసంగం)తో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జస్టిస్ ఎస్ఆర్ఎల్ నాగేశ్వరరావు, కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, అధ్యక్షుడు శ్రీగిరిరాజు అయ్యపరాజు తదితరులు పాల్గొన్నారు.

179 బాటిళ్ల మద్యం పట్టివేత

బెల్లంకొండ: తెలంగాణ నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాజా తెలిపారు. మండలంలోని పాపాయపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మద్యం తీసుకొస్తున్నారని సమాచారంతో దాడులు చేసినట్లు తెలిపారు. పాపాయపాలెం గ్రామ సమీపంలో పిల్లేరు వాగు వద్ద మద్యం తరలిస్తున్న రాంబాబు, పెద్దోడులను అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న 179 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.